# పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి

## సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్,డిసెంబర్19 : సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ కారణంగా నిలిచిన అభివృద్ధి పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ రజిత నేతృత్వంలో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల బృందం ఎమ్మెల్యేగా గెలిచిన పద్మారావు గౌడ్ ను మంగళవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. త్వరలో వివిధ విభాగాల అధికారులతో సమావేశమై వివిధ అభివృద్ధి పనులపై పురోగతిని సమీక్షిస్తామని తెలిపారు. సీతాఫల్‌మండిలోని తమ కార్యాలయం నిరంతరం ప్రజలకు అందుబాటులో నిలుస్తోందని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ కార్యాలయంలో సంప్రదించవచ్చునని అన్నారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ లతో పాటు నేతలు కంది నారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా బౌద్ధనగర్ డివిజన్ బీఆర్ఎస్ నేత బెజ్జంకి రాజేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయనను పద్మారావు గౌడ్ సత్కరించారు.



ఎమ్మెల్యే పద్మారావును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

## అందుబాటులో ఉండి..సేవ చేస్తా

### కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత



ఎమ్మెల్యే లాస్యనందితకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న వీఆర్ ఆసుపత్రి ఎండీ నందకిశోర్ తదితరులు

కంటోన్మెంట్, డిసెంబర్ 19: కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అన్నారు. మంగళవారం కార్ఖానాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను పలు వార్డుల ప్రజలు వచ్చి కలిశారు. బోయిన్‌పల్లిలోని వీఆర్ ఆసుపత్రి ఎండీ నందకిశోర్ ఎమ్మెల్యే లాస్యనందితకు శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, అభివృద్ధితోపాటు సేవ చేస్తానన్నారు. ఏ కష్టం వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. తనవంతు సహాయ సహకారాలను అందించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. యువతకు ఉద్యోగవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలపై తప్పకుండా గళం విప్పుతానని స్పష్టం చేశారు. అంతకుముందు జింఖానా మైదానంలో ఈ నెల 22న జరగనున్న డిస్ట్రిక్ లెవల్ యూత్ ఫెస్టివల్‌కు ప్రత్యేక అతిథిగా రావాలని కోరుతూ జింఖాన గ్రౌండ్ ప్రతినిధులు ఎమ్మెల్యే లాస్యనందితను ఆహ్వానించారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యురాలు అనితాప్రభాకర్, నేతలు నివేదిత, కేబీ శంకర్‌రావు పాల్గొన్నారు.

## బీబీఏ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీబీఏ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీబీఏ (లాజిస్టిక్స్), బీబీఏ (రిటెయిల్ ఆపరేషన్స్) తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 28 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

## నేటి నుంచి ఓయూలో అంతర్జాతీయ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 19: ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ విభాగంలో బుధవారం నుంచి అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జువాలజీ – ఇన్నోవేషన్స్ చాలెంజెస్ అండ్ అపార్చునిటీస్'అనే అంశంపై నిర్వహించనున్న ఈ సదస్సు మూడు రోజుల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు చెప్పారు. ఓయూ సైన్స్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్న సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్‌కుమార్ నందికూరి, శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్న సదస్సు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నోసిస్ మాజీ డైరెక్టర్ డాక్టర్ తంగరాజ్ హాజరవుతారని వివరించారు.

## నగర తొలిమేయర్‌కు ఘన నివాళి



జేబీఎస్ చౌరస్తాలో కృష్ణ స్వామి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ తదితరులు

మారేడ్‌పల్లి, డిసెంబర్ 19 : సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ చౌరస్తాలో మంగళవారం నగర తొలి మేయర్ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. కొర్వి కృష్ణ స్వామి ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పిట్ల నాగేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్ హాజరై కృష్ణ స్వామి ముదిరాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సభ అధ్యక్షుడు డాక్టర్ శంకర్ ముదిరాజ్, ప్రతినిధులు వేణుగోపాల్ ముదిరాజ్, అశోక్, మల్లేశ్, సోక్కం శ్రీను, సత్యనారాయణ, పిట్ల సురేశ్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్థలాలను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు



మొండిబండనగర్‌లో గుడిసెలను తొలగిస్తున్న అధికారులు

అడ్డగుట్ట, డిసెంబర్ 19 : రైల్వేకు సంబంధించిన స్థలంలో నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు హెచ్చరించారు. మంగళవారం మొండిబండనగర్‌లో ఖాళీగా ఉన్న రెండు గుడిసెలను స్థానిక తుకారాంగేట్ పోలీసుల సహకారంతో రైల్వే యంత్రాంగం తొలగించారు.ఈ సందర్భంగా రైల్వే అధికారులు మాట్లాడుతూ...రైల్వే స్థలాలను ఆక్రమించాలని చూస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొండిబండనగర్‌లో కొన్ని సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని ఉంటున్న వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించడం లేదని వారు తెలిపారు. నూతనంగా రైల్వే స్థలాల్లో నిర్మాణాలు చేపడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని వారు స్పష్టం చేశారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన



చిలకలగూడలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ తదితరులు

సికింద్రాబాద్,డిసెంబర్19:సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని చిలకలగూడ కింది బస్తీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ సామల హేమ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని చిలకలగూడలో దాదాపు రూ.28 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టినట్టు తెలిపారు.అనంతరం స్థానికులతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ, జీహెచ్ఎంసీ అధికారులు ఏఈ కౌశిక్ , బీఆర్ఎస్ నాయకులు గౌస్,మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



సోమాజిగూడలోని విల్లామేరీ కళాశాలలో క్రిస్మస్ సందర్భంగా కోస్పెల్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ వేడుకలను డైరెక్టర్ డాక్టర్ ఫిలోమినా ప్రారంభించారు.–ఖైరతాబాద్.

## 'డ్రగ్స్ రహితంగా మార్చుకుందాం'

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 19: హైదరాబాద్ మహానగరాన్ని డ్రగ్స్ రహితంగా మార్చుకుందామంటూ ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో లైబ్రెరీ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు నిర్వహించిన ర్యాలీ అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చింత గణేశ్, అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, ఓయూ చరిత్ర విభాగం హెడ్ ప్రొఫెసర్ అర్జున్‌రావు మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు యంత్రాంగంతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మేడ శ్రీనివాస్, సుమన్‌గౌడ్, రహీం, అంజిగౌడ్, సత్య పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

మారేడ్‌పల్లి, డిసెంబర్ 19: సికింద్రాబాద్‌లోని మెట్రో పోలీస్ హోటల్‌లో మంగళవారం కేఈఐ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్లకు సీఎస్ఆర్ కింద 'స్వాస్థ్య ఉత్సవ్ ' పేరుతో జనరల్ హెల్త్ చెకప్, ఐ చెకప్‌తో పాటు హెల్త్ కార్డులను అందించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంటర్నేషన్ కాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కృష్ణారెడ్డి హాజరై ప్రసంగించారు. ఎలక్ట్రీషియన్లు పని ఒత్తిడితో ఆరోగ్యం పై శ్రద్ధ చూపించరని వారి, వారి కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎలక్ట్రీషియన్ల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధతో పాటు ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పిస్తున్నామని కేఈఐ సీనియర్ డీజీఎం రవీందర్ బుర్రా తెలిపారు. స్వాస్థ్య ఉత్సవ్ కిట్స్‌ను వారికి ఉచితంగా అందించారు.

## ఓయూ, కేయూ ప్రొఫెసర్ల పదోన్నతులపై విచారణ జరిపించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 19 : ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీల్లో ప్రొఫెసర్లకు సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించడంలో అవకతవకలు జరిగాయని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి సత్య నెల్లి ఆరోపించారు. దీనిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా సీనియర్ ఐఏఎస్ అధికారితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ అక్రమంగా సీనియర్ ప్రొఫెసర్ అయిన వారిని వెంటనే తొలగించి, అర్హత కలిగిన వారికి సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. ఇప్పటి వరకు సీనియర్ ప్రొఫెసర్ హోదా కోసం 53 మంది దరఖాస్తు చేసుకోగా, 51 మందికి పదోన్నతి కల్పించారని గుర్తు చేశారు. యూజీసీ నిబంధనల ప్రకారం సీనియర్ ప్రొఫెసర్ కావాలంటే ప్రొఫెసర్‌గా పది పరిశోధనా పత్రాలు సమర్పించి ఉండాలని, వాటిని యూజీసీ కేర్ లిస్ట్, స్కోపస్, వెబాబ్ సైన్స్ వంటి రీసర్చ్ జర్నల్స్‌లో ప్రచురించాలన్నారు.

## నిరుద్యోగ యువతకు సదావకాశం

### - కేంద్రసాయుధ బలగాల పోటీ పరీక్షలకు 'పరావస్తు' అండ
### - ఉచిత శిక్షణ అర్హతకు ఈ నెల 23న ప్రవేశపరీక్ష నిర్వహణ

కంటోన్మెంట్, డిసెంబర్ 19: కేంద్ర సాయుధ బలగాలైన బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, ఎస్ఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ చేపట్టనున్న నేపథ్యంలో పరావస్తు క్రియేటీవ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్ ఆసక్తిగల అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమైంది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) సీఆర్‌పీఎఫ్( సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్)తో సహా పలు విభాగాలకు సంబంధించిన కానిస్టేబుళ్ల నియామకాల కోసం పరావస్తు క్రియేటీవ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వడానికి ఈ నెల 23 శనివారం ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు ముచ్చా రాంరెడ్డి, పరావస్తు క్రియేటీవ్ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్‌లు గద్దె భాస్కర్, సందీప్ హరి, డాక్టర్ లక్ష్మీకుమారిలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ లోపు పరావస్తు క్రియేటీవ్ ఫౌండేషన్ వెబ్‌సైట్ లేదా ఫేస్‌బుక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హత పరీక్షలను హైదరాబాద్, గుంటూరు, నారాయణఖేడ్, వనపర్తి కేంద్రాల్లో పరీక్షను నిర్వహించనున్నట్లు చెప్పారు.

ప్రవేశ పరీక్షల్లో పాల్గొన్న వారి ఫలితాలను ఈ నెల 24వ తేదీన వెబ్‌సైట్‌లో వెల్లడించడం జరుగుతుందన్నారు. మెరిట్ సాధించిన అభ్యర్థులకు డిసెంబర్ 26 నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు.